## కాంగ్రెస్ వస్తే వ్యవసాయం ఖతమే..



పర్వతగిరి: కాంగ్రెస్ నాయకులు వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలు అంటున్నరు. ఇగ ఆ పార్టీ అధికారంలోకి వస్తే వ్యవసాయం ఖతమే. కాంగ్రెస్ పాలనలో రాత్రి పూట కరెంటు మోటర్లు పెట్టేందుకు వెళ్లి అనేక మంది రైతులు ప్రమాదాలకు గురయ్యారు. సీఎం కేసీఆర్ వచ్చాక 24గంటల కరెంటుతో రైతాంగం ఎంతో బాగుపడ్డరు. కాంగ్రెస్ వస్తే మూడు గంటలే కరెంటు ఇస్తామని, ధరణి తీసేస్తామని వాళ్లు అంటుంటే పాత రోజులు గుర్తుకొస్తున్నాయి. ధరణితో భూముల పంచాయితీలు, తగాదాలు లేవు. కేసీఆర్ సీఎం అయ్యినంక అందరికీ ఎంతో మేలు చేస్తున్నరు. మళ్లా బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలి.

**- చింతపట్ల రామ్ గోపాల్‌రావు, పర్వతగిరి రైతు**

## ధరణి లేకుంటే దళారులే రాజ్యమేలుతరు



హసన్‌పర్తి: ధరణి పోర్టల్ లేకుంటే దళారులే రాజ్యమేలుతరు. ధరణి రద్దు చేస్తే కాంగ్రెస్ వాళ్లే దళారులుగా భూములను మరొకరికి రిజిస్ట్రేషన్లు చేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తరు. కొన్నేళ్ల క్రితం రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే రోజుల కానంగా ఆఫీసుల చుట్టూ తిరిగి దళారులకు డబ్బులు ఇచ్చి నానా తిప్పలు పడేది. భూములు అమ్మితే నెలలు గడిచినా కాని రైతుకు టైమ్‌కు డబ్బులు వచ్చేవి కావు. కేసీఆర్ సీఎం అయిన తర్వాత ధరణి తెచ్చిండు. ఒక్క రోజులోనే తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసి పట్టాదారు పాస్‌బుక్ ఇస్తాండ్లు. ధరణి వచ్చినంక రైతుల భూములకు రక్షణ ఏర్పడింది. ధరణి పోర్టల్ ఉండాల్సిందే.

**- మేక భగవాన్‌రెడ్డి, సీతంపేట, హసన్‌పర్తి మండలం**



## 791 పోలింగ్ కేంద్రాలు.. 7,56,608 ఓటర్లు

- వరంగల్ జిల్లాలో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- ఎన్నికల అధికారి పి.ప్రావీణ్య

కాశీబుగ్గ, నవంబర్ 29: జిల్లాలోని అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను గురువారం ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్, ఎన్నికల అధికారి పి.ప్రావీణ్య తెలిపారు. మంగళవారం ఎనుమాముల మార్కెట్ యార్డులో డీఆర్‌సీ కేంద్రాల ద్వారా వర్ధన్నపేట, వరంగల్ తూర్పు నియోజక వర్గాల్లోని పోలింగ్ కేంద్రాలు, నర్సంపేట నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ మెటీరియల్ నర్సంపేట మార్కెట్ యార్డ్ డీఆర్‌సీ ద్వారా పోలీస్ భద్రత వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు. జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 791 పోలింగ్ కేంద్రాలలో 7లక్షల 56వేల 608 ఓటర్లు ప్రశాంత వాతవరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 161 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలైన వెబ్ కాస్టింగ్‌తో పాటు అధిక భద్రత సిబ్బందిని ఏర్పాటు చేశామని, 1506 మైక్రో అబ్జర్వర్లను, 963 పోలింగ్ ఆఫీసర్లు, 959 సహాయ పోలింగ్ అధికారులు, 1929 ఇతర పోలింగ్ అధికారుల ద్వారా పోలింగ్ నిర్వహిస్తున్నామని అన్నారు. 3 నియోజక వర్గాలకు 1629 బ్యాలెట్ యూనిట్లు 987 కంట్రోల్ యూనిట్లు 1107 వివి ప్యాట్లు కేటాయించి కేంద్రాలకు తరలించడం జరిగిందన్నారు. జిల్లాలో 15 మహిళల ద్వారా నిర్వహించే పోలింగ్ కేంద్రాలు, మూడు దివ్యాంగుల పోలింగ్ కేంద్రాలు, 15 మోడల్ పోలింగ్ కేంద్రాలు, మూడు యువ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

## ఉచ్చులో చిక్కుకున్న ఎలుగుబంటి

వర్ధన్నపేట, నవంబర్ 29: అడవి పందుల నుంచి రక్షించుకోవడానికి ఏర్పాటు చేసిన ఉచ్చులో ఎలుగుబంటి చిక్కిన ఘటన మండలంలోని దమ్మన్నపేట సమీపంలో బుధవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. దమ్మన్నపేట శివారులోని గుట్ట వద్ద బుధవారం ఉదయం ఎలుగుబంటి అరుపులు వస్తుండడంతో స్థానికులు వెళ్లి చూశారు. గుట్ట కింది భాగంలో ఓ తల్లి ఎలుగుబంటి ఉచ్చులో చిక్కుకున్నట్లు వారు గుర్తించారు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు చేరుకొని ఎలుగుబంటిని బోనులో బంధించి తీసుకువెళ్లారు. తల్లి ఉచ్చులో చిక్కుకోవడంతో దాని రెండు పిల్లలు అరుపులు కూడా వినిపించాయని స్థానికులు తెలిపారు. అటవీశాఖ అధికారులు వచ్చేసరికి పిల్లలు చుట్టుపక్కల కనిపించకపోవడంతో తల్లిని మాత్రమే తీసుకువెళ్లారు.

## ఎక్సైజ్ సీఐ అంజిత్‌రావు సస్పెన్షన్

సుబేదారి, నవంబర్ 29 : వరంగల్ అర్బన్ పరిధిలోని ఎక్సైజ్ సీఐ అజింత్ రావును ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ సస్పెండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నతాధికారులకు ఏలాంటి సమాచారం ఇవ్వకుండా హెడ్ క్వార్టర్‌లో ఉండకుండా బయటికి వెళ్లినందుకు క్రమశిక్షణ చర్యలలో భాగంగా ఆయనను సస్పెండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఏ అధికారి సమాచారం లేకుండా పని చేసే హెడ్ క్వార్టర్ వదిలి వెళ్ల వద్దన్న స్పష్టమైన అదేశాలు ఉన్నప్పటికి ఆయన దానిని ఉల్లంఘించడంతో ఆయనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు.

## కాంగ్రెస్ వస్తే కరెంట్ కోతలే..



ఐనవోలు: కాంగ్రెస్ వస్తే కరెంట్ కోతలే ఉంటాయి. గతంలో పంటల నీళ్లు పారించేందుకు రాత్రీ పగలు తేడా లేకుండా బావి కాడికిపోయి అక్కడే పడుకొని నీళ్లు పారించేది. కొంత పండేది. ఇంకొంత ఎండేది. నాటి రోజులు మాకు వద్దు. సీఎం కేసీఆర్ 24గంటల కరెంటు ఉచితంగా ఇస్తుంటే ఐదారు గంటలు ఇస్తామని కాంగ్రెస్ వాళ్లు చెప్పడం ఏమిటో? కాంగ్రెస్ వస్తే కష్టాల పాలవుతాం.

*- కావాటి స్వామి, రైతు, పెరుమాండ్లగూడెం*

## రైతు సమస్యలు రేవంత్‌రెడ్డికి తెలియదు



మడికొండ: రైతుల సమస్యలు రేవంత్‌రెడ్డికి తెల్వదు. నాడు రాత్రి పూట నిద్ర పోకుండా నీళ్లు పెట్టేందుకు బాయి కాడికి పోయేది. అయినా పూర్తిగా పారేది కాదు. 24 గంటల కరెంటు ఇస్తున్న సీఎం కేసీఆర్‌ను గెలిపించుకోవాలి.

*- ఊకంటి జయపాల్‌రెడ్డి, రాంపేట, కాజీపేట మండలం*



ఐనవోలు: పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది



హసన్‌పర్తి: మడిపెల్లికి చేరుకున్న సిబ్బంది



కాశీబుగ్గ: సూచనలు చేస్తున్న డీసీపీ, ఏసీపీ

# పోలింగ్ కేంద్రాలకు తరలిన ఈవీఎంలు

- నియోజకవర్గంలో 2.69లక్షల మంది ఓటర్లు
- పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

వర్ధన్నపేట, నవంబర్ 29: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో జిల్లా అధికాయ యంత్రాంగం ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని బుధవారం ఎన్నికలు ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, సిబ్బందికి అందజేశారు. సాయంత్రమే బస్సుల్లో ఎన్నికల అధికారులు ఈవీఎంలు, సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ, పలు ప్రైవేట్ పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్‌వోలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడంతో పాటు ఓటర్లకు సమస్యలు ఉంటే తెలియజేసేందుకు వారి ఫోన్ నంబర్‌లను కేంద్రాల వద్ద రాయించారు.

### 2,69,192 మంది ఓటర్లు

వర్ధన్నపేట నియోజకవర్గంలో 2,69,192 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 1,32,736 పురుషులు, 1,36,441 మంది మహిళలు ఉన్నారు. నియోజకవర్గ పరిధిలోని హసన్‌పర్తి, హనుమకొండ, ఐనవోలు, పర్వతగిరి, వర్ధన్నపేట పూర్తి మండలాలతోపాటు పట్టణ పరిధిలోని ఖిలావరంగల్, వరంగల్, కాజీపేట పరిధిలోని ఓటర్లు 278 పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 2018లో 2.25లక్షల ఓటర్లలో 85 శాతానికి పైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల కోసం అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 63 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి ప్రత్యేక బందోబస్తు చేస్తున్నారు. వర్ధన్నపేట పీవో, అదనపు కలెక్టర్ అశ్వనీ తానాజీ వాకడే, ఇతర ఎన్నికల అధికారులు, పోలీసు ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఈవీఎం యంత్రాలను పీవో, ఏపీవోలకు అందజేశారు.




పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బీఎల్‌వో నంబర్

### ఐనవోలు మండలంలో..

ఐనవోలు: అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ కోసం మండలంలోని పోలింగ్ కేంద్రాలకు బుధవారం ఈవీఎంలను చేరవేశారు. మండలంలో మొత్తం 30,062 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 14833, స్త్రీలు 15228, ఇతరులు 1 ఉన్నారు. వీరంతా తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మండల వ్యాప్తంగా 35 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. మండలంలోని గర్మిళ్లపల్లి, వెంకటాపుర గ్రామాల్లో మొత్తం 5,725 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 2,807, స్త్రీలు 2,918 ఉన్నారు. 6 పోలింగ్ బూత్‌ల్లో ఓటు హక్కును వినియోగించుకుంటారు. పోలింగ్ కేంద్రాల్లో ముందస్తుగా అధికారులు ఏర్పాట్లును చేశారు. ఓటర్లు సైతం ఫొటో గుర్తింపు కార్డు, పోల్ చిట్టీలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటలకు వరకు పోలింగ్ జరగనుంది.

### హసన్‌పర్తి మండలంలో..

హసన్‌పర్తి: మండలంలోని వివిధ గ్రామాల పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది బుధవారం సాయంత్రం ఈవీఎంలు, సామగ్రితో చేరుకున్నారు. తెల్లవారితే ఓటింగ్ నిర్వహిందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. పోలీస్ సిబ్బంది బందోబస్తుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద పోటీ చేసే అభ్యర్థుల వివరాలను గోడలకు అతికించారు.

### ఎనుమాముల మార్కెట్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీ

కాశీబుగ్గ: అసెంబ్లీ ఎన్నికల సామగ్రిని పోలింగ్ సిబ్బందికి వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో అప్పగించారు. పోలింగ్ ఆర్‌వోలు ఈవీఎం, వీవీ ప్యాట్స్ భద్రపరిచే గోదాంలను సందర్శించి పరిశీలించారు. ఎన్నికల సామగ్రిని బయటకు తీయించారు. పత్తియార్డులో వరంగల్ తూర్పు అసెంబ్లీ, ఆపరాల యార్డులో వర్ధన్నపేట నియోజకవర్గ ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. ఎన్నికల సాధారణ పరిశీలకుడు ఎస్.షణ్ముగరాజన్, కమిషనర్ ఎన్నికల ఆర్‌వో షేక్ రిజ్వాన్‌బాషా ఎన్నికల ప్రక్రియ, పంపిణీ క్లుప్తంగా వివరించారు. అనంతరం బస్సుల్లో ఎన్నికల సామగ్రితో పాటు సిబ్బందిని పోలీస్ ఎస్కార్ట్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. కాగా, ఎనుమాముల మార్కెట్ ప్రాంగణంలోని ఆపరరాల యార్డులో పోలీసు సిబ్బందితో డీసీపీ రవీందర్ సమావేశం నిర్వహించి, ఏసీపీ సతీష్‌బాబు పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు.



కాశీబుగ్గ: అధికారితో మాట్లాడుతున్న ఆర్వో రిజ్వాన్‌బాషా



కాశీబుగ్గ: వివరాలు తెలుసుకుంటున్న ఎన్నికల సిబ్బంది



వర్ధన్నపేట పోలింగ్ కేంద్రంలో వేసిన టెంటు



కాశీబుగ్గ: ఎన్నికల సామగ్రితో బయల్దేరిన సిబ్బంది



కాశీబుగ్గ: ఎన్నికల సామగ్రితో పోలింగ్ సిబ్బంది